
# రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- పరిగి తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



దరఖాస్తుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి, ఆగస్టు 13 : రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిగి తహసీల్దార్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి.. రికార్డు, రిజిస్ట్రేషన్, డేటా ఎంట్రీ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులొచ్చాయి.. వాటిలో ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. సక్సేషన్, పెండింగ్, మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను కలెక్టర్ పరిశీలించి వెంటనే పరిష్కరించాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం పరిగి ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఏర్పాటుచేసిన ప్రజాపాలన కేంద్రం, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రజాపాలనలో మ్యాచ్ కాని దరఖాస్తులను ఎలా గుర్తించాలనే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించాలని వారిని ఆదేశించారు. అంగన్‌వాడీల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ను డెలివరీ చేయాలి

వికారాబాద్ : లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ మిల్లర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సీఎంఆర్ డెలివరీలో ఆలస్యంపై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మిల్లులు పట్టిన బియ్యాన్ని (సీఎంఆర్) ఎఫ్‌సీఐకి నిర్ణీత సమయంలో చేరవేయాలన్నారు. 2021-22 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను త్వరగా అందించాలన్నారు. అదేవిధంగా 2022-23 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను సెప్టెంబర్ మొదటి వారంలోగా ఇచ్చేందుకు మిల్లర్లు కృషి చేయాలన్నారు. మిల్లర్ల యాజమాన్యాలు, యూనియన్ నాయకులు కలిసి సీఎంఆర్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు తమ రోజువారీ టూర్ డైరీల్లో ఏఏ మిల్లులను సందర్శించారో నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆఫీసర్లు రాజేశ్వర్, సుగుణ, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్తా, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.





అంబేద్కర్ కూడలిలో ర్యాలీ తీస్తున్న రైతులు, నాయకులు

# పేదల భూముల్లో అభివృద్ధి పనులు వద్దే..వద్దు..

- కొడంగల్‌లో ఉన్న సీలింగ్ భూముల్లో ఆ పనులను చేపట్టాలి
- సాగు భూములను తీసుకోవాలనుకోవడం దుర్మార్గం
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు
- పేదల భూములు పెట్టుబడిదారులకు ఇచ్చేందుకు యత్నిస్తున్నారని మండిపాటు

కొడంగల్, ఆగస్టు 13 : అభివృద్ధి పేరుతో ప్రభుత్వం పేదల భూములను లాక్కుని పెట్టుబడి దారులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు ఆరోపించారు. మంగళవారం రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి భూసదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫార్మా కంపెనీల పేరుతో బొంరాస్‌పేట మండలంలోని హకీంపేట, లగచెర్ల, పోలెపల్లి, పులిచర్ల, రోటిబండ తండాల్లో 1274 ఎకరాలు, మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో 74 ఎకరాల పేదల భూములను సేకరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సాగు చేసుకొంటున్న భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టడం దుర్మార్గ చర్య అని మండిపడ్డారు. అభివృద్ధి జరుగుతుందంటే సంతోషమే కానీ పేదల భూములను బలవంతంగా తీసుకుని పెట్టుబడిదారులకు అప్పగించడం అన్యాయమన్నారు.

కొడంగల్ ప్రజల అండతో సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. వారికి అన్యాయం తలపెట్టడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు కొడంగల్‌లో ఉన్నటువంటి 1156 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీరు మారకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మనసు మార్చుకుని రైతుల కు అండగా నిలిచి, వ్యవసాయ రంగానికి భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో కొన్నేండ్లుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుని జీవిస్తున్న రైతులకు పట్టాపాస్‌బుక్‌లు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంబేద్కర్ కూడలిలో రైతులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ హక్కుల పోరాట సం ఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, శ్రీనివాస్, మల్కయ్య, సుదర్శన్, సతీశ్, శ్రీనివాస్, సత్తయ్య, రఘురాం, రైతులు మల్లికార్జున్ గోపాల్‌నాయక్, బస్సప్ప, యాదయ్య, శివకుమార్, సేవ్యానాయక్, రాములు, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో సతీశ్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, ఆగస్టు 13 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రంగారెడ్డి డీఎల్పీవో సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పకడ్బందీగా చేపట్టాలని, వనమహోత్సవ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసేలా కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. వీధి కుక్కల బెడద తగ్గించాలని.. వార్డుల వారీగా ఓట్ల వివరాలను సరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, ఏఈపీఆర్‌ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డబ్బులకు ఆశపడి మహిళను హింసిస్తారా ?

- కొందరు పోలీసులు దారితప్పుతున్నారు
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్
- దళిత మహిళ సునీతకు పరామర్శ

షాద్‌నగర్, ఆగస్టు 13 : డబ్బులకు ఆశపడి విచారణ పేరుతో ఓ దళిత మహిళను చిత్రహింసలకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చోరీ చేశారనే నెపంతో ఫరూఖ్‌నగర్‌కు చెందిన సునీతను రాత్రి 2 గంటల వరకు షాద్‌నగర్ పోలీసులు ఎలా విచారిస్తారని, చట్టాల గురించి పోలీసులకు తెలియదా..? అని మండిపడ్డారు. షాద్‌నగర్ పోలీసుల చేతుల్లో చిత్రహింసలకు గురైన సునీతను మంగళవారం ఆయన పరామర్శించి ..వివరాలు సేకరించారు. కొందరు పోలీసులు దారి తప్పుతున్నారని, పోలీసులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. పౌర హక్కులను పూర్తిస్థాయిలో రక్షిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశ గా అడుగులు వేయడంలో విఫలయ్యారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన మూడు రోజులకే ఓ ఠాణాలో మరణం చోటుచేసుకున్నదని, ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని, దళితులపై దాడులు ఆగ డం లేదన్నారు. సునీతను హింసించిన డీఐ రాంరెడ్డితో సహా ఇతర సిబ్బందిని విధుల నుంచి తొలగించాల న్నారు. సునీతను ఆదుకోవాలని, ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా ఉండాలన్నారు. విచారణ అధికారిగా ఉన్న షాద్‌నగర్ ఏసీపీ ఏకపక్షంగా విచారించడం సరికాదని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు నారాయణరావు, ఎండీ సుభాన్, బాలయ్య, రాములు, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, ఎండీ ఉస్మాన్ పాల్గొన్నారు.



సునీతతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

# రియాజ్ హత్యకు మేడిపల్లిలో స్కెచ్

- రౌడీషీటర్ హంతకులకు 15 రోజులుగా ఆశ్రయమిచ్చిన ఓ వ్యక్తి
- ఆ ఇంటి వద్ద పోలీసుల పహారా
- ఏడుగురు నిందితుల అరెస్టు

యాచారం, ఆగస్టు 13 : ఇటీవల బాలాపూర్‌లో రౌడీషీటర్ రియాజ్ హత్యకు గురికాగా.. రియాజ్‌ను హత్య చేసిన నిందితులకు మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆశ్రయమిచ్చాడు. ఆ నిందితులు గత 15 రోజులుగా మేడిపల్లిలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రియాజ్‌ను ఎలా హత్య చేయాలో ఇక్కడే ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. ఇక్కడి నుంచే బాలాపూర్‌కు వెళ్లి రియాజ్‌ను హత్య చేసి తిరిగి వచ్చినట్లు సమాచారం. కాగా నిందితులు ఉన్న ఇంటిని మంగళవారం ఉదయమే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రియాజ్‌ను హత్య చేసిన నిందితులు సోమవారం మేడిపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు అక్కడి నుంచి విజయవాడ వెళ్లినట్లు తెలుసుకున్న పోలీసులు విజయవాడలో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని మేడిపల్లిలో వారు ఉన్న ఇంటికి తీసుకొచ్చారు. బాలాపూర్ పోలీసులు హైదరాబాద్‌గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావు సహకారంతో ఆ నిందితులను ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించారు. రియాజ్‌ను హత్య చేసేందుకు వాడిన కత్తి, తుపాకీ తదితర మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మేడిపల్లి శివారులోని ఓ చెరువులో నిందితులు పడేసిన రక్తపు మరకలతో కూడిన బట్టలు, ఇతర సామగ్రినీ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు తరలించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితులు ఉన్న ఇంటి చుట్టూ పోలీసుల పహారా

# గుప్త నిధుల వ్యామోహం.. వ్యక్తి మృతి

- ఎనిమిది మందికి రిమాండ్
- విలేకరులకు వివరాలు వెల్లడించిన సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్, ఆగస్టు 13 : గుప్త నిధులపై ఉన్న వ్యామోహం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా రాయి పై నుంచి కింద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనలో మంగళవారం ఎనిమిది మందిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. మే 21న బొంరాస్‌పేట మండలంలోని దాందార్‌పూర్ గ్రామ శివారులోని బ్రిడ్జి కింద కుళ్లిన మృతదేహం లభించగా.. మృతుడి కుమారుడు కుమ్మరి నరేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. విచారణలో సత్యప్ప మృతిపై ఉన్న మిస్టరీ వీడిందన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సత్తయ్య గత ఐదేండ్లుగా భువనగిరి, నల్గొండ తదితర ప్రాంతాల్లో గుప్త నిధుల తవ్వకాలు సాగిస్తున్నాడు. గతేడాదిన్నర క్రితం మహబూబ్‌నగర్ జిల్లాలోని సర్కార్‌పేట గ్రామ గుట్టల్లో నిధులు ఉన్నట్లు తెలుసుకొని అక్కడికెళ్లి చూడగా..ఏనుగు బొమ్మ ఉన్న రాతి కట్టడాన్ని తూముగుట్ట వద్ద గుర్తించి.. తనకు తెలిసిన గురువుతో ఈ విషయాన్ని చెప్పగా.. అక్కడ నిధులుంటాయని తెలపడంతో తవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం శర్మ, సుందరయ్య, సైదులు సహకారాన్ని తీసుకున్నాడు. అదేవిధంగా నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని నాగసాన్‌పల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, సల్కార్‌పేట గ్రామానికి చెందిన నాగరాజు, వెంకటయ్య, సత్యప్పను సంప్రదించగా వారూ అంగీకరించారు. నిధి ఉన్నదని అనుకున్న తూముగుట్ట ప్రాంతానికి వారందరూ చేరుకున్నారు. అక్కడ ఇద్దరు వ్యక్తులను దూరంగా కాపలాగా ఉంచి.. మిగిలిన వారు రెండు గ్రూపులుగా విడిపోయి తవ్వకాలు చేపట్టారు. 18 ఫీట్ల వరకు తవ్వినా ఫలితం లేకపోవడంతో.. హైదరాబాద్ పాతబస్తీలోని షకీల్‌ను తూముగుట్ట ప్రాంతానికి తీసుకెళ్లి చూపించగా.. తూముగుట్టకు అడ్డంగా తవ్వితే నిధులు దొరుకుతాయని చెప్పడంతో.. ఆ దిశగా తవ్వకాలు చేపట్టారు. మే 17న సైదులు, సత్యప్ప, వెంకటయ్య, షకీల్‌లు.. తూముగుట్టలో తవ్వుతుండగా పైన ఉన్న రాయి సత్యప్పపై పడడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. సత్యప్ప మృతి చెందినట్లు ఎవరికీ తెలియొద్దని వారు భావించారు. అందుకోసం అదే రోజు రాత్రి మృతదేహాన్ని గుట్టపై నుంచి కారులో తరలించి బ్రిడ్జి వద్ద బైక్ ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించి.. ఆ తర్వాత మృతదేహాన్ని బైక్‌తోపాటు బ్రిడ్జిపై నుంచి కిందికి తోసేశారు. పోలీసులు అనుమానంతో శంకరయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా సత్యప్ప మృతికి సంబంధిం చిన విషయాన్ని చెప్పాడు. దీంతో ఈ ఘటనకు సం బంధించిన ఎనిమిది మందితో పాటు ఉపయోగించిన కారు, వాడిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో సహకరించిన బొంరాస్‌పేట ఎస్ఐ రవూఫ్, సిబ్బంది బాలు, శ్రీనులను సీఐ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

## పంద్రాగస్టు వేడుకలకు కోట్‌పల్లి విద్యార్థి

బంట్వారం, ఆగస్టు 13 : పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా గురువారం ఢిల్లీలో జరుగను న్న జెండావిష్కరణ కార్యక్రమంలో నిర్వహిం చే పరేడ్‌కు కోట్‌పల్లి మండలంలోని జడ్పీహెచ్ ఎస్‌కు చెందిన విద్యార్థి సాయిచరణ్ హాజరు కానున్నారు. ఈ పాఠశాలలోని విద్యార్థులు గత రెండేండ్లుగా కిచెన్ గార్డెన్ నిర్వహించి అం దులో వివిధ రకాల కూరగాయలను సేంద్రి య విధానంలో పండిస్తున్నారు. వాటినే మ ధ్యాహ్న భోజనంలో వంటలకు వినియోగిస్తు న్నారు. విద్యార్థుల కృషిని వికారాబాద్ డీఈ వో రేణుకాదేవి అభినందించారు. పీఎంశ్రీ కార్యక్రమానికి ఈ స్కూల్‌ను ఆమె ఎంపిక చేశారు. పంద్రాగస్టు వేడుకల్లో జరిగే జెండావిష్కరణ కార్యక్రమానికి సాయిచరణ్‌తోపాటు సైన్స్ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ వెళ్లానున్నారు.



సాయి చరణ్ విద్యార్థి

## మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ

షాబాద్, ఆగస్టు 13: సివిల్ సర్వీసెస్ పరీక్షలు (మెయిన్స్, ఇంటర్వ్యూ) -2024 కోసం ఎస్టీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు రంగారెడ్డి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు యూపీఎస్సీ-సీఎస్, సీ-ప్రిలిమినరీ పరీక్ష 2024లో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలన్నారు. వారికి సన్నద్ధమయ్యేందుకు మెంటార్ గైడెన్స్‌తోపాటు ఓ ట్యాబ్, ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 73826 20487, 70934 66985 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# తగ్గుతున్న ఫ్లాట్ సైజ్

### నగరంలో పడిపోతున్న సగటు ఫ్లాట్ విస్తీర్ణం

సిటీబ్యూరో, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): మహానగరంలో ఫ్లాట్ల సైజ్ తగ్గుతున్నది. ఓ వైపు జనాలు విశాలమైన ఇండ్లకు ప్రాధాన్యతనిస్తుంటే మరోవైపు సగటు ఫ్లాట్ విస్తీర్ణం ఒక్క ఏడాదిలోనే 13 శాతం పడిపోయింది. దీంతో 2271 చదరపు అడుగుల నుంచి 2010 చదరపు అడుగులకు పడిపోయినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తాజాగా వెల్లడించింది. గడిచిన మూడేండ్లలో నివాసముండే ఫ్లాట్ విస్తీర్ణం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అనూహ్యంగా సైజు తగ్గిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా లగ్జరీ ఇండ్లకు కాలం చెల్లినట్లేనని, కొనుగోలుదారుల సంఖ్య తక్కువ ఉండటమే కారణంగా తెలుస్తున్నది. 2023 నుంచి ఇప్పటివరకు క్రమంగా ఫ్లాట్ విస్తీర్ణం తగ్గుతుండడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపడంలేదని.. దీంతో రానున్న రోజుల్లో లగ్జరీ ఇండ్ల కంటే సామాన్యుడు కొనుగోలు చేసేందుకు వీలుగా ఉండే ప్రాజెక్టులు మాత్రమే మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ భారీ విస్తీర్ణంలో ఉండే ఫ్లాట్లను నిర్మించినా... అమ్మకాలు, వాటి సంఖ్య పరిమితంగా ఉండే పరిస్థితులు నెలకొంటున్నాయి. అనరాక్ వెల్లడించిన నివేదిక ప్రకారం దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో క్రమంగా ఫ్లాట్ ఏరియా తగ్గుతుందని తేలింది. అయితే దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో విశాలమైన ఫ్లాట్లను కలిగిన నగరాల్లో హైదరాబాద్ రెండో స్థానంలో ఉండగా, జాబితాలో ఢిల్లీ అగ్రస్థానంలో నిలిచింది.

# పార్టీనా.. పైసల్ కట్టు!

- మందు పార్టీకి పర్మిషన్ తప్పనిసరి
- ఆరు బాటిళ్ల నిబంధనలు సైతం అమలు
- ఆన్‌లైన్‌లో అనుమతులు

సిటీబ్యూరో, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): పార్టీలు చేసుకుంటున్నారా.. అయితే మీపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నిఘా ఉంటుంది. హోటల్స్, ఫామ్ హౌస్‌లు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎక్కడ దావత్‌లు చేసుకున్నా మీ వద్దకు ఎక్సైజ్ శాఖ వచ్చి వాలుతుంది. ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువగా తాగేశారంటే మీరు కేసులో ఇరుక్కోవాల్సిందే. ఏదైనా ఒక ప్రాంగణాన్ని అద్దెకు తీసుకొని అక్కడ పార్టీ చేసుకుంటున్నారంటే తప్పని సరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాల్సిందే. డబ్బులు పెట్టి మందు కొని, ఆ మందు తాగడానికి పర్మిషన్ తీసుకోవడమేమిటంటూ సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఒక వ్యక్తి ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువ కల్గి ఉండకూడదనే నిబంధన ఉంది, దానిని అవసరాన్ని బట్టి అమలు చేస్తుంటారు. ఇండ్లలో జరిగే పార్టీలను మాత్రం చూసి చూడనట్లు వదిలేస్తామని అధికారులు చెబుతున్నారు.



### ఫామ్‌హౌస్‌లే టార్గెట్ ...

జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో సాధారణ మద్యం పార్టీకి రూ. 12 వేలతో అనుమతి పొందాల్సి ఉంటుంది. అదే ఆ పార్టీలో 500 మంది హాజరవుతున్నారంటే దానికి రూ. 50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్‌ఎంసీయేతర ప్రాంతాల్లో రూ. 9 వేలు చెల్లించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం విక్రయాలు ఎక్కువ చేసి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తుంది. శివారు ప్రాంతాల్లో ఫామ్ హౌస్‌లను టార్గెట్ చేసుకుంటూ అందినకాడికి జరిమానాలు వసూలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల శివారు ప్రాంతాలలో ఫామ్ హౌస్ కల్చర్ పెరుగుతుంది. దీంతో బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు సమావేశాలు, గెట్ టు గెదర్ పార్టీలు చేసుకోవాలంటే ఒక చిన్న ఫామ్ హౌస్‌ను తీసుకుంటున్నారు. రూ. 5 వేలు పెట్టి ఫామ్‌హౌస్ కిరాయి తీసుకుంటే అందుకు డబుల్ వెచ్చించి లిక్కర్ పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరముంటుంది. ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చిన్న అవకాశాలను వదిలేయడం లేదు. ఒక పక్క రోజు రోజుకు పెరుగుతున్న బెల్ట్ దుకాణాలు, మరో పక్క లిక్కర్ అనుమతులంటూ ఎక్సైజ్ శాఖ ప్రజలను పీడిస్తుందని విమర్శలున్నాయి. లైసెన్స్ అనుమతి కోసం https://excise.telangana. gov.in/లో సంప్రదించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# 5,6 తేదీల్లో ఏఐ గ్లోబల్ సమ్మిట్

### హెచ్‌ఐసీసీలో నిర్వహణ

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంతర్జాతీయ సదస్సుకు కౌంట్‌డౌన్ ఆరంభమైంది. దేశంలోనే మొట్టమొదటి సారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై రెండు రోజులపాటు దేశ, విదేశాలకు చెందిన టెక్నాలజీ నిపుణులతోపాటు ఔత్సాహిక ఏఐ స్టార్టప్‌ల నిర్వాహకులతో సెప్టెంబర్ 5-6 తేదీల్లో హెచ్‌ఐసీసీ వేదికగా సదస్సు జరుగనున్నది. ఇందులో వివిధ అంశాలపై నిపుణులు కీలక ప్రసంగాలు చేయనున్నారు. ఆరోగ్య సంరక్షణ నుంచి విద్య వరకు, వాతావరణ మార్పుల నుంచి వ్యవసాయం వరకు ఏఐతో మార్పులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉన్నది. మరోవైపు రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో టీ హబ్, హైసియా వంటి సంస్థలు సైతం ఏఐ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇంకా 20 రోజులే మిగిలి ఉండడంతో ఐటీ రంగంలోని కంపెనీలను భాగస్వాములను చేస్తున్నారు. ఐటీ శాఖ పరిధిలోని ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఏఐ ఫర్ సోషల్ చేంజ్ నినాదంతో విస్తృత ప్రచారాన్ని చేపట్టింది. సమాజానికి ఏఐ ఏ విధంగా మేలు చేస్తుందన్న అంశాలను ప్రస్తావిస్తూ ప్రచార పోస్టర్లను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు.

### ఏఐ సిటీకి తుది రూపం

హెచ్‌ఐసీసీలో జరుగనున్న ఏఐ గ్లోబల్ సదస్సులో కార్యాచరణను ప్రకటించనున్నారు. నగర శివారు ప్రాంతంలో ఒకే చోట ఒకేసారి 200 ఎకరాల భూములను ఏఐసిటీ కోసమే కేటాయించి, దానికి ప్రభుత్వం శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. ఏఐ సంబంధిత కార్యకలాపాలన్ని ఏఐసిటీలోనే జరిగేందుకు వీలుగా ఐటీ కంపెనీలతోనూ అధికారులు చర్చిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు ఏఐపై పరిశోధనలు చేసేందుకు, ప్రాజెక్టులు రూపొందించేందుకు అవసరమైన మద్దతు రాష్ట్ర ఐటీ శాఖ ఇచ్చేలా విధానాలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే దేశంలోనే బెంగళూరు తర్వాత ఐటీ రంగంలో హైదరాబాద్‌కు గుర్తింపు రాగా, ఏఐ గ్లోబల్ సమ్మిట్‌తో మహానగరం మరింత ముందుకెళ్లనుందని నిపుణులు పేర్కొంటున్నారు.